# నటుడు



**దేవరాజు మహారాజు**

గోపాలం గొప్ప నటుడు కావాలను కున్నాడు. కాలేకపోయానని ఇప్పుడు బాధపడుతుంటాడు. అలా బాధ పడడం అతని తప్పు. నిజాని కతడు మంచి నటుడు. ఆ సంగతి అతనికే తెలియదు. ఆఫీసులో, ఇంట్లో, స్నేహితుల దగ్గర బాగా నటించి మంచివాడని పేరు తెచ్చుకున్నాడు. నిజానికి ఆఫీసరుకు వంగి దణ్ణం పెట్టాలన్నా, భార్య పని చెబితే చేయాలన్నా, స్నేహితుల దగ్గర తీసుకున్న అప్పులు తీర్చేయాలన్నా మహా చెడ్డ చిరాకు; అసలు ఇష్టం లేదుకూడా. కాని, అవన్నీ చేస్తుంటాడు. అందుకే అందరూ అతన్ని మంచివాడు, మెత్తనివాడు అంటుంటారు. కాని, బీదవాడని చాలామంది అతన్ని గుర్తించరు. అతని నటనలోని నైపుణ్యమే అందుకు కారణం.

చేతిలో కాఫీడబ్బా, పూలు, అవి కొనగా మిగిలిన నెల జీతం జేబులో ఉండగా, చంకలో రెండు ఆఫీసుఫైళ్లతో అచ్చు హనుమంతునిలా అడుగు లేస్తూ వచ్చాడు ఆ రోజు గోపాలం. రోజూలా రాధ ఎదురు చూస్తూ నిలబడలేదు. అసలు తలుపులే తెరిచి లేవు, తాళం వేసి ఉంది. గోపాలానికి కించిత్ అనుమానం కలిగి, దీని భావమేమి తిరుమలేశ అనుకుంటూనే, తలుపు పక్కగా ఉన్న కిటికీ రెక్క తోశాడు. అది తెరుచుకుంది. కిటికీ కడప చాటుకు తాళం చెవి ఉంది. రాధ ఎప్పైనా వెళితే, తాళం చెవి అక్కడ పెట్టి వెళుతుంది. ఆ బ్రహ్మ రహస్యం ఇంకెవరికీ తెలియదు. తాళం తీసుకుని లోనికెళ్లి చేతిలోవి టేబుల్‌పై పెడుతూ ఉంటే, చిన్న ఉత్తరం కనిపించింది.

"నేను శారదమ్మగారింటి కెళుతున్నాను. ఏదో ఫంక్షనుందట. పొద్దుటి నుండి మూడు సార్లు కూతుర్ని పంపించింది. అందుకే తప్పలేదు. పగలు ఇంట తను వచ్చి మూణ్నెళ్ల కిరాయి ఇవ్వాలి అని గొడవ చేసి, సాయంత్రం వస్తానని వెళ్లాడు.

మీ స్నేహితుడెవరో డేవిడ్ అట వచ్చాడు. మీరు లేరంటే ఉత్తరం వ్రాసి ఇచ్చాడు. టేబుల్ సొరుగులో ఉంది, చూసుకోండి. ఇక మన ఊరి నుండి బాబాయి వచ్చారు. మనం అప్పుడు భూమి కొన్నాం కదూ– ఆ బాపతుది ఇంకో అయిదు వంద లివ్వాలిట కదూ? అందుకే వచ్చారు. 'ఈ సారైనా గోపాలం మిగిలిన రూపాయలిస్తే అలా తీర్థయాత్రలైనా చేసుకుందామని' అంటూ తెలిసిన వాళ్లెవరి దగ్గరికో వెళ్లి ఓ గంటలో వస్తానని వెళ్లారు.

ఇంట్లో సామాన్లు అయిపోయాయి. సామాను పట్టికూడా సొరుగులోనే పెట్టాను. ఈ వేళ సాయంత్రం వీలైతే తెండి. ఇంత డబ్బు ఎలా తెస్తారో, వాళ్లకేం సమాధానం చెబు[illegible] నాకు

భయంగానే ఉంది. నే నొచ్చేసరికి బాగా ఆలస్యం కావచ్చు.

—మీ రాధి."

ఏదైనా అత్యవసరంగా వెళ్ళవలసి వస్తే అలా చిన్ని ఉత్తరాలు వ్రాసి పెట్టి వెళ్ళిపోవడం ఆ భార్య భర్తల కలవాటే. అలాంటి వెన్నో చదువుకున్నాడు ఇంతకు ముందు గోపాలం. కాని, ఇప్పుడు గోపాలానికి దిగులు పట్టుకుంది ఉత్తరం చదవగానే. బయట ఎండ తీవ్రంగానే ఉంది. ఇక్కడ గోపాలం చెమట వర్షంలో తడుస్తున్నాడు. భయంభయంగా టేబుల్ సొరుగు తెరిచి డేవిడ్ ఉత్తరం, సామాను పట్టి తీసి చూశాడు. సామానుకో వందైనా కావాలి అనుకుంటూనే డేవిడ్ ఉత్తరం చదివాడు. సారాంశం — తీసుకున్న ఏభై తిరిగి ఇవ్వు అని తప్ప వేరే ఏమీ లేదు. "ఇంతకు ముం దెన్ని కారణాలు చెప్పినా అంతగా పట్టించుకోలేదు గాని, మా మదర్‌కు సీరియస్‌గా ఉంది. డబ్బు అత్యవసరం. ఈ వేళే రాత్రి ఏడు ప్రాంతంలో వస్తాను. ఇచ్చేస్తే కృతజ్ఞుణ్ణి" అని కూడా వ్రాయడంతో గోపాలానికి గాభరా నిజంగానే ఎక్కువయింది. ఎందుకంటే, ఇప్పుడు తప్పించుకుందుకు వీల్లేదు. సీరసం ఆవరించింది. అసహాయత ఏదో ఆవరించింది. తల వంచుకున్నాడు గోపాలం, తలవంపు లొస్తాయేమోనని.

కుర్చీలో కూలబడ్డాడు నిముగ్నం. ఎవరెవరికి ఏం సమాధానాలు చెప్పాలో ఆలోచిస్తున్నాడు. కాని, ఎవరికి ఏం చెప్పినా కుదిరేట్లు లేదు. అంతా ముదిరిపోయింది. మనసంతా అయోమయంగా తయారు చేశాయి, ఈ ఉత్తరాలు.

లోన వరండాలోని కిటికీలో ఫ్లాస్క్ కనిపిస్తోంది. కాఫీ గాని చేసి పెట్టిందేమో రాధి — వెళ్ళి తాగాలనిపించింది. ఉహూఁ కదల్లేదు.

ఏదో నిశ్శబ్దం లాంటి బద్ధకం లేవనీయ లేదు. అలాగే కళ్ళు మూసుకుని ఎంతో సేపు కూర్చున్నాడు. సమయం తెలియలేదు గాని, టేబుల్ వాచీ టిక్ టిక్ శబ్దం వినవస్తోంది. ఒక్కసారిగా కళ్ళు తెరిచాడు. బయటి నుండి ఎవరో పిలుస్తున్నారు.

"గోపాలం ... గోపాలం ..."

"ఆఁ" దిగ్గున లేచాడు. "ఎవరూ?" అంటూ గుమ్మం వైపు నడిచాడు.

సంపంగి!

సిగరెట్ త్రాగుతూ నిలబడ్డాడు వాకిట్లో.

"ఒరేయ్, రారా!" స్నేహితుణ్ణి చూడగానే ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

"ఏం చేస్తున్నావు రోయ్?" అంటూ సిగరెట్ పారేసి లోన అడుగేశాడు సంపంగి.



దుఃఖాతిరేకం

ఫొటో—ఎస్. గిరిధర్ (మద్రాసు)

"రా! లోనికి రా."

"ఏం? మీ ఆవిడ లేదా?"

"ఉహూఁ"

"ఎటు వెళ్ళింది?"

"ఏదో పేరంటానికి"

"అదీ ఒకందుకు మంచిదే. మరి నడువ్. సినిమాకి వెళదా మనుకుంటిమిగా? కల్ ఆజ్ ఔర్ కల్, రాజ్‌కపూర్ ఫిల్మ్! ! దిల్షాద్‌లో ఉన్నట్టుంది."

"అబ్బే, అవన్నీ చూడలేనిప్పుడు. ఈ 'ఆజ్' ఎలా వెళుతుందోనని భయంగా ఉంది."

"ఏం, ఏమయింది ఈవేళటికి? జీతం ఇప్పుడు తీసుకుంటివి గదరా! ఈ రోజు కూడా భయమే?"

"పరిస్థితు లలా వచ్చాయి. వచ్చేసరికి ఈ ఉత్తరా లున్నాయి. చూడగానే చలి జ్వరం పుట్టినంత పనయింది. మనం ఆఫీసులో సినిమా ప్రోగ్రాం వేసుకున్న విషయం కూడా మరిచి కూలబడ్డాను."

"ఏమిటి? ఏమైంది? ఏ ఉత్తరాలు?" అసలు విషయమేమి టన్నట్లు చూశాడు మిత్రుడు.

విషయమంతా చెబితే ఏదైనా ఉపాయం చెప్పకపోడు. ఎందుకంటే, సిడిది తెలివైన బుర్ర. ఆఫీసులోని స్టాఫ్ ఎవరైనా ఏదైనా అడిగితే ఉచిత సలహా లిస్తుంటాడు. అందుకే చెప్పేయాలని పించింది గోపాలానికి.

"అయితే, విను, చెబుతున్నాను. నా గోడవ అర్థం చేసుకో. ఏదైనా వెలిగిస్తే చెయ్యి. నా స్నేహితులలో ముఖ్యుడివి కాబట్టి ఈమాత్రం భారం నీ మీద వుంచుతున్నా" అన్నాడు సీరియస్‌గా గోపాలం.

"ఓహో! ఏదారోయ్ సంగతి! తెలిస్తే నవ్వాలు పడతాంగాని!" దీర్ఘం తీస్తూ అన్నాడు సంపంగి, పక్కనే ఉన్న రేడియో ఆన్ చేస్తూ.

"ష్! మళ్ళీ అదేమిటి? ఆఫ్ చేసెయ్యి. నిజంగా సీరియస్ విషయం. జయోమయంగా ఉందోయ్."

చెబుతుండగానే ఆఫ్ చేసి, వింటానన్నట్లు కుర్చీలో సరిగా కూర్చున్నాడు. గోపాలం అంతకు ముందు చదివిన ఉత్తరాలన్నీ చదివి వినిపించాడు. ఇదో ఈ వేళ ఎత్తుకున్న జీతం, మూడు వందలు. వీటి నెవరి కివ్వాలి? ఉపాయం చెప్పు అన్నట్లు గోపాలం చూపులు తీవ్రంగా గుచ్చుకుంటున్నాయి, సంపంగిని.

అవున్రోయ్. కష్టమే వచ్చి పడింది అని మూలిగింది సంపంగి మనసు. సిగరెట్ తీసి అంటించాడు. మళ్ళీ ఉదాసీనంగా కూర్చున్నాడు గోపాలం. ఓ రెండు నిమిషాల తరవాత—

"ఈ వేళ మనం సినిమా మానేయవలసి వచ్చేట్లుందిరోయ్" అన్నాడు మిత్రుడు, తొడుక్కున్న ఫుల్ షర్టు చేతుల్ని పైకి మడుచుకుంటూ.

"పోనీలే, తరవాత చూడచ్చు" విసుగు విసిరేశాడు గోపాలం సంపంగి మీదికి.

"మరి ఈ ఒక్క రోజు ఈ ప్రమాదాలన్నీ తప్పిపోయేట్లు చేస్తాను. రేపటికి పరిష్కారం నువ్వే ఆలోచించుకో."

"సరే"—తల ఊపకుండానే అన్నాడు గోపాలం.

"ఇదైనా అంతా నీ నటన మీదే ఆధారపడి ఉంటుంది. ఎంత బాగా నటిస్తే అంత మంచిది. నీ వెనక నే నుంటాననుకో." డైరెక్టరులా పోజు పెడుతూ మెల్లగా అనేశాడు పదార్ల మిత్రుడు సంపంగి.

నటన అనేసరికి ఏదైనా రభస అవుతుందేమోనని గోపాలానికి భయం కలిగినా, ఇంత మందికి, ఈ రాత్రికి అంత డబ్బు సర్దడానికి వేరే మార్గం లేదు గనక కొంత సేపు మౌనంగా ఉండి మరోసారి సరేనన్నాడు.

సిగరెట్ దమ్ములు రెండు పైన పైన పీల్చి అవతలికి విసిరేసి, పొగ సుతారంగా గోపాలం వైపు ఊదుతూ, "అయితే, విను" అంటూ మొదలెట్టాడు సంపంగి. "నువ్వు మతి చలించినట్లు — మనిషి మనిషి కానట్లు నటించాలి. ఎవర్నీ కూడా - అంటే మీ ఇంటతన్ని గాని, వచ్చిన మీ బాబాయిని గాని, డేవిడ్‌ని గాని గుర్తు పట్టనట్లు, తుదకు నేను కూడా ఎవరో నీకు తెలియనట్లు నటించాలి."

"ఎందుకు, నాయనా! హాస్పిటల్లో ఏదైనా ఖాళీ బెడ్ ఉందా నా కోసం!" గోపాలం.

"ఛ ఛ! అలా కాదురా. నువ్వు విను, నేను ఉన్నానుగా నీకు తోడు? ఆఫీసులో ఎత్తైన మెట్లమీంచి పడ్డావని, రక్తం ఏమీ పోలేదని, అయినా హాస్పిటల్‌కు ఆఫీసు జీప్‌లో తీసుకెళితే, బ్రెయిన్‌లో కొంత డిస్టర్బెన్స్ అయిందని డాక్టరన్నాడని, ఇంజక్షనిచ్చాడని, ఏం పరవాలేదు మెల్ల మెల్లగా ఎప్పటిలా అందర్నీ గుర్తు పడతాడు అని కూడా డాక్టరన్నాడని నేను వచ్చిన వాళ్ళందరికీ చెబుతాను. ఇదంతా అబద్ధమైనట్లు, బాగానే ఉన్నట్లు నువ్వు మాట్లాడాలి. దీనివల్ల ఎక్కడి వా ళ్ళక్కడ ఈ రాత్రికి డబ్బు లడక్కుండా నిష్క్రమిస్తారు."

"బాగానే ఉంది. కథంలో లాగు ప్లాట్ అల్లావు గాని, పీచు పీచు మంటూంది గుండె."

"పీచూ లేదు, నాచూ లేదు. అదంతే, అలా చెయ్యవలసిందే!" తప్పదన్నట్లు గట్టిపరిచాడు సంపంగి.

గోపాలం ముఖం ఎఱ్ఱబడింది. ఇంత మోసం తను చెయ్యగలడా? ఓ వైపు

మనసు వర్షింటూంది. మరో వైపు పరిస్థితులు ఫరవాలేదు, వెయ్యేవోయ్ అంటున్నాయి. గోపాలం మాట్లాడక పోవడం సంపంగికి కాస్త చిరాకనిపించింది — ఇందుకు ఒప్పుకోడో ఏమోనని. మరో రెండు మూడు నిమిషాలు చూశాడు. అదే మూసుకున్న నోరు, కంపిస్తున్న ఒళ్ళు, మూసుకున్న కళ్ళు.

"ఒరేయ్, నాకు తోచింది చెప్పాను. వినకుంటే నీ ఇష్టం. మరే సమాధానాలైనా వెతుక్కో. నే వెళుతున్నా" అంటూ లేచాడు.

తపస్సులోంచి కళ్ళు తెరుస్తున్నట్టు తెరిచి, "కూర్చో" అన్నాడు గోపాలం. "భయంగా ఉంది. మా ఆవిడ కూడా రాలేదు."

గోపాలా న్నాపుతూ, "రాకున్నా ఫరవా లేదు. రాకుంటేనే మేలు. ఒక వేళ ఎవరూ రాక ముందే మీ ఆవిడ వస్తే అన్నీ నేర్పి ఆమెను కూడా మనతో నటించమందాం. తరవాత వస్తే ఆవిడను కూడా నువ్వు గుర్తు పట్టనట్టు నటించు. ఏం?"

"మా ఆవిడకు కూడా చెప్పర్దా?" అమాయకంగా అడిగాడు గోపాలం.

"వద్దు. నేను చెప్పినట్టు చేయి." లేచి గోపాలం వీపు చరిచి, "నీకేం భయం వద్దు" అన్నాడు సంపంగి.

గోపాలంలో కూడా కొంత ధైర్యం కలిగింది. అతనిలో నటించాలన్న కోర్కె కదిలింది. "ఓకే, బాస్!" అని స్టైలిష్‌గా లేచి అంటూ, "కాస్త మొహం కడుక్కు వస్తా" నంటూ బుష్ షర్టు విప్పి, కుర్చీకి తగిలించి బాత్ రూమ్ వైపు వెళ్ళాడు గోపాలం. ఇంతలో సంపంగి మరో సిగరెట్ వెలిగించుకుని, ఎన్నో రోజుల్నుండి చూడాలనుకున్న సినిమా ఈ వేళ కూడా చూడలేక పోతున్నందుకు విసుక్కున్నా, పాపం, స్నేహితుడికి కొంత సహాయపడుతున్నాను గదా అన్న సంతృప్తితో వెచ్చగా గుండెల్లోకి పొగను పీల్చుకుని రింగులు రింగులుగా పొగను వదులుతూ కూర్చున్నాడు. గడియారంలో నాలుగు నిమిషాలయిపోయే సరికి విసురుగా వచ్చాడు గోపాలం టవల్‌తో తుడుచుకుంటూ.

"ఆఁ ... ఎస్! ఎవరు కావాలండి మీకూ?" అన్నాడు. సంపంగి ఆశ్చర్యపోయిన వాడల్లా ఓహో గుర్తు పట్టనట్టు నటించడం ఇప్పటి నుండే ప్రారంభించినట్టుం దనుకుంటూ నవ్వుతూ, "గోపాలం గారు కావాలండి" అని లేచి వినయంగా నిలబడ్డాడు.

"గోపాలమా? ఎవరూ? నా పేరు వేణుబాబండీ!! ఏదో రాంగ్ అడ్రెసుకు మీ రొచ్చినట్టున్నారు." చాలా సీరియస్‌గా మొహం పెట్టి అన్నాడు.

సంపంగికి నవ్వాగింది కాదు. "వెరీ గుడ్, డియర్ ఇడియట్! స్లేటు ఇలా తిప్పాలి! మెరికొస్తోయ్."

స్నేహితుడి నవ్వులో తన నవ్వింత కలిపాడు గోపాలం, మళ్ళీ షర్టు వేసుకుంటూ.

"ఏరా, కాఫీ తాగుతావా?" గోపాలం ఫ్లాస్క్ చేతిలోకి తీసుకుంటూ అడిగాడు.

"అంత పాపాత్ముణ్ణేం కాదు, పోస్తే తాగక పోవడానికి." స్నేహితుని మాటలు అయిపోక ముందే, నిరాశ వ్యక్తం చేశాడు గోపాలం.

"ఛట్! ఇందులో ఏం లేదు. ఖాళీ."

"నీ బుర్ర లాగా!"



ఊగిదా...

చిత్రం — పవన్‌కుమార్ సైనిక్ (సికింద్రాబాద్)

"ఆఁ. సంతోషించాంలే — మాటలొచ్చునని! కాని, కాఫీ ఎలా? హోటలుకు పోదామా? ఇంట్లోనే స్టౌ మీద పెట్టేయనా?"

"అబ్బ, బోరు! ఇప్పుడేం చేస్తావురా? హోటలుకే వెళదాం పద." తేల్చేశాడు సంపంగి.

ముందు రూములో కెళ్ళేసరికి —

గోపాలం గుండె ఠక్ మంది. ఎదురుగా బజారులో బాబాయి ఇటే వస్తున్నారు, ధోవతి పైకి పట్టుకుని, ఠీవంతా ఒలకబోస్తూ.

"వచ్చేస్తున్నాడ్రోయ్. దుష్టాగ్రేసరుండు!!" అటు వైపు కనుబొమ్మ లెగరేస్తూ అన్నాడు గోపాలం. సంపంగి ఇట్టే పసిగట్టాడు.

"ఆ వచ్చేదేనా మీ బాబాయి రాయుడు?"

"అవును. భయమేస్తోంది — ఎలా?"

అతను మరీ దగ్గరి దాకా వచ్చేశాడు. గోపాలానికి భయమవుతూనే ఉంది. పులిని చూసిన జింకలా, మాడిన వంకాయలా మహా ఇదవుతున్నాడు. కాళ్ళు వణుకుతున్నాయి. గోపాలానికి కథక్ డాన్స్ మాత్రం రాదు. అయినా, నిభాయించుకున్నాడు, ఓ సారి రొమ్ము విరుచుకుని.

"ఏమిటయ్యా, నీకేం కావాలి? మీరు గాని, మీ ఆఫీసులోని వారు గాని నాకు తెలియదని చెప్పానా? వినపడదూ?"

"ఒరేయ్, గోపాలం! జ్ఞాపకం తెచ్చుకోరా. నేను ... పంపంగిని." ఆగంతుకుడు వచ్చి బయట గుమ్మం దగ్గర అనుమానంగా నిలబడి గోపాలాన్ని అనుమానంగా చూశాడు. ఓ క్షణం తరవాత గుర్తుపట్టినట్లే—"బాబూ, గోపాలం! బాగేనా, నాయనా?" అంటూ లోన అడుగు పెట్టాడు.

గోపాలం చిరునవ్వు ఒలకలేదు. ముడి వేసిన కనుబొమ్మల్ని విప్పలేదు. మర్యాద చేయాలన్న భావాన్ని హృదయంపై కప్పలేదు. అదే — ఆముదం తాగిన మొహం పెట్టక తప్పలేదు. ఎవరినో జీవితంలో మొదటిసారిగా చూసిన వ్యక్తిలా — "ఎవరండి? ఏం కావాలి?" అన్నాడు.

"ఆఁ. నేనోయ్. నీ బాబాయిని! రామచంద్రరావును."

"సారీ, సర్, రాంగ్ అడ్రెసు! నా పేరు గోపాలం కాదు. అసలు నాకు బాబాయే లేరు. మూడేళ్ళ క్రితం ఏక్సిడెంట్‌లో చచ్చిపోయారు." బయట పడకుండా గంభీరంగా చెప్పాడు. "ఇతనెవరో మీలాగే గోపాలం అంటూ వెనకబడ్డాడు. మీ కేమయిం దీవేళ? ఆఁ."

"సర్, మీరీయనకు బాబాయా, సార్?" దీనంగా అన్నాడు సంపంగి.

"అవునండీ."

"అయ్యో! ఏ ఊరి నుండి వస్తున్నారో ఏమో? ఈ స్థితిలో మీరు వాణ్ణి చూడవలసి వస్తోంది."

"ఏమిటండి, ఏమైంది?" ఆదుర్దాగా అడిగాడు గోపాలం బాబాయి.

"మతి కాస్త చలించిందండీ." నింపాదిగా ఏడుపు స్వరంతో చెప్పాడు.

"ఆఁ ... అలాగా! ఉదయం మా రాధ నడిగితే బాగానే ఉన్నారు, ఆఫీసు కెళ్ళా రంది."

"అది ఉదయం సంగతండీ, సర్! ఆఫీసులోనే చలించింది. నేనూ, వీడూ ఒకే ఆఫీసులోనే ఉద్యోగం. పక్కపక్కనే కూర్చుంటాం. నన్నే గుర్తు పట్టడం లేదు..." చెప్పుకుపోతున్నాడు సంపంగి.

"వాట్ టీజ్ దిస్ నాన్సెన్స్? బ్లడీ!" ఏదో ఉద్వేగంలో అవధోయి తమాయించుకుని, "క్లీక్! నన్ను డిస్టర్బ్ చెయ్యకండి. ఇప్పుడో కాన్ఫరెన్స్ ఉంది. అటెండ్ కావాలి. క్లీక్ గ!" అని ముఖం నిప్పులు చెరుగుతూండగా అన్నాడు గోపాలం, లోనికి వెళ్ళుతూ.

ఇద్దరి ముఖాలు ఒకరి కొకరు చూసుకుంటూ కూర్చున్నారు, భయం భయంగా కొద్ది సేపు. గోపాలం లోన కెళ్ళాడు. గోపాలంతో మాట్లాడడానికి అతని బాబాయికి ఎలాగో ఉంది. ఓ రకపు ఆందోళన. మతి చలించిందే అన్నదాని కన్నా, నా రూపాయ లిస్తాడా లేదా, రేపే వెళ్ళిపోవాల్నాయె నన్న బెంగ ముసలాడికి. చేతులు కట్టుకుని చిక్కుచిక్కుమంటూ కూర్చున్నాడు సంపంగి. చివరికి ధైర్యం చేసి పిలిచాడు, ఇంట్లోకి తొంగి చూస్తూ ముసలాడు: "రాధా ... అమ్మాయ్, రాధా!"

విసురుగా వచ్చాడు గోపాలం. "బుద్ధుందయ్యా మీ కసలా? వెళ్ళి పొమ్మంటే వినిపించడం లేదూ — ఎందు కింత తలబిరుసుదనం? ఆఁయ్. పోలీసులకు ఫోన్ చేసేదా?"

ఎందుకో గానీ, పోలీసనగానే ముసలాడి మనసులో భయం మెరుపు మెరిసింది. అందుకే—"ఎందుకురా, గోపాలం, మండి పడతావు?" అంటూ ఏదో అనబోయాడు.

"ఛీ! ఇడియట్!!" పక్కన ఉన్న టేబుల్ ధన్ మని కొట్టాడు గోపాలం. "నా ఇంటికొచ్చి ఎవడో గోపాలం, గోపాలం అని కలువరిస్తారేమిటి? మీరు వెళతారా, లేదా?"

గోపాలం నిజంగా తను నటిస్తున్నా నన్న విషయం మరిచాడు. ప్రథమంలో ఉన్న బెరుకుకూడా పోయింది. చాలా ఫ్రీగా మాట్లాడేస్తున్నాడు. గడి యారం చూసుకున్నాడు. 'ఓఫ్ టైమ్ అయిపోతుంది.' బొమ్మలు పైకెత్తి మరీ అనుకుని కుర్చీలో కూర్చున్నాడు. బాబాయిని కూర్చో అని కూడా అనలేదు. అతడు నిలబడే దీనంగా చూస్తున్నాడు.

"రంగన్నా, ఒరే, రంగన్నా! డ్రైవర్ని కారు తీయమని చెప్పు" అన్నాడు గోపాలం.

సంపంగికి నవ్వొస్తూంది, గోపాలం పోజులకు. రంగన్న లేడు. డ్రైవరూ లేడు. కారు అంతకన్నా లేదు.

ఒక్క నిమిషం అలా కూర్చున్నాడో, లేదో సంపంగి ఏదో చెప్పబోయాడు. గోపాలం అందుకుని, "ష్! ఇంక్లేం విన్నేను. వెళ్లిరాండి. వెంకటేషం ... వెంకటేశ్... ఇలా రా. గూర్ఖాను పిలిచి ఈ ఇద్దర్నీ వెళ్లగొట్టించు" అంటూ లోని కెళ్లిపోయాడు.


"అవునూ, మీ అమ్మ గారు కూడా బజారు కొస్తానన్నారు. మేడ మీద ఉందేమో చూడు. తయారవమను" అంటున్నాడు. బయటికి వినవస్తున్నా యీ మాటలు. గోపాలం బాబాయికి నిజం గానే ఇప్పుడు అనుమానం కలుగుతూంది, గోపాలానికి మతి చలించినట్టు. ఇల్లేమో ఏవ్ బెస్టాన్‌తో కప్పి ఉంటే వీడు మేడంటా డేమిటి?

"రంగన్నా! నా రెండు సూట్లూ డ్రై క్లీనర్స్ నుంచి తెచ్చి పెట్టమని చెప్పాను. ఏవీ — ఆఁ... తేలేదూ? ఇడియట్! ఎందుకు తేలేదు? అమ్మ గారు పని చెబితే మాత్రం అంత తీర కుండా చెప్పిందా!' ఈవేళయినా తెచ్చి పెట్టు. విడిచేసినవి ఈ హాంగర్స్ కున్నాయి. తీసుకెళ్లి వేసేయ్. ఈవేళ బాగా ఆలస్యంగా వస్తాను. డిన్నర్ లేటే ఉంది. అమ్మగారికి చెప్పు ..."

గోపాలం ఏకపాత్రాభినయం లాంటిది చేస్తున్నాడు.

ఇంతలోకి రాధ వచ్చింది. రామ చంద్రరావుకు ఆవిడను చూడగానే గోపాలం సంగతి చెప్పాలనిపించింది. విషయం ఎలా మొదలెట్టాలి అని సందేహ పడుతుండగానే, సంపంగి కూర్చోడం చూసి ఆవిడ గబగబా లోని కెళ్లి పోయింది.

లోన గోపాలం కుర్చీలో కూర్చుని




టేబుల్ పైకి, రేడియో మీద కాళ్ల పెట్టి ఏదో గొణుక్కుంటున్నాడు. ప్రాణప్రదంగా చూసుకునే రేడియో పై అంత నిర్లక్ష్యంగా కాళ్లు పెట్టా డేమిటి? రాధకు కొత్తగా, వింతగా కూడా అనిపించింది.

"మీకోసం వాళ్లు బయట ఉంటే మీ రిక్కడ కూర్చున్నారేం?" చేతిలోని పాకెట్లు టేబుల్ మీద పెడుతూ అంది.

"ఓ ప్యారీ డీ! నీ కోసమే చూస్తున్నా. మనం ఈ వేళ వెళ్లవలసిన కాన్ఫరెన్స్ కాన్సిలయిందట. ఇప్పుడే ఫోనొచ్చింది. నిన్నటి కేసు విషయానికి సంబంధించిన కాగితాలన్నీ టైపు చేయించి ఉంచామను కుంటాను" అంటూ నింపాదిగా కాళ్లు కిందికి దించాడు, గోపాలం. "సంతకాలు తరవాత చేస్తాగాని, ఆఫీసు నుంచి నర సింగాచార్య ఫోన్ చేశాడు, నన్ను రమ్మని. నా పెర్సనల్ సెక్రటరీ రాగానే తోలిస్తా నని చెప్పాను. అందుకే నువ్వెళ్లి ఆ విషయ మేదో చూసి ఇంటి కెళ్లిపో. నీ కోసం అతను వెయిట్ చేస్తుంటాడు. బహుశా నా కార్లో వెళ్లు. రేపు మాత్రం ఎర్లీగా రావాలి."

ఓపికగా వింటున్న రాధ మనసులో కొంచెం కోర్కె కలిగింది. ఈయన గారికి తగ్గట్టే "ఎస్, సర్" అని చెప్పి రిక్షాలో ఏ స్నేహితురా లింటికో వెళ్లిపోతే, అయ్య గారి పని అవుతుంది. అన్నం కూడా వండలేదు.

అక్కడ వాళ్లెంత ఉండమన్నా ఆగక, ఇక్కడ ఈ రాధి ప్రియు డుండలేడని తనొస్తే — ఇవా పోజులు?! కాని, పిల్ల బాబాయున్నారు. స్నేహితు డున్నాడు. వీళ్లంద రుండగా ఈయన ఏమేం రాగా లమ్మా ఈవేళ? — విసుక్కుంది.

"మా ఆఫీసు వాళ్లంతా కలిసి డ్రామా వేస్తున్నా రండి?"

"ఊఁ. అన్నట్టు — అవును. ప్యారీటీ! నేషనల్ థియేటర్స్‌లో ఏదో సెరివర్స్ ప్రోగ్రాం ఉందిట. ఇన్విటేషన్ వచ్చింది. కాని, మా ఆవిడ ఇంట్లో లేదు. నిన్న రాంతే వెళ్లింది. అందు లోనా వెళ్లాలనిపించడంలేదు. పోయినా ఎంజాయ్ చేయలే నేను."

ఇలా అడిగేమిటి ఈ పని? [illegible] కోపం వస్తోంది. కారణం [illegible] మాట్లాడుతున్నందుకు కాదు. బయట వాళ్లు లేకుంటే తనెట్టు [illegible] మాట్లాడేదే కాని, డ్రాయింగ్ రూమ్‌లో వాళ్లందరం వల్ల తను మాట్లాడడానికి వీలు చిక్కడం లేదు. అందుకే ఆమెలో మెల్లగా కోపం చోటుచేసుకుంది. కాని, ఇంతలోనే రామచంద్రరావు ఆమెని పిలి చాడు. తలుపు దగ్గిర కర్టెన్ చాటుగా ఆమె నిలుచుంది — ఏమిటన్నట్టు.

ఇంతలోనే సంపంగి ఏడ్పు స్వరంతో, "మీ కెలా చెప్పాలండీ? గోపాలం ఆరోగ్యం కొంచెం బాగు లేదు. భయం లేదు, క్రమంగా కోలుకుంటాడు. మతి కొంచెం చలించింది" అంటూ ఆఫీసులో జరిగిందని కలిపించిన విషయం, డాక్టరన్న విషయం వగైరా అన్నీ 'చల్లగా చావు కబురు' అన్న చందాన చెప్పేసరికి నిజంగా రాధ మనసులో గందరగోళం మొద లైంది. ఏదో ఆందోళన.

"అవునమ్మా. మమ్మల్నీ గుర్తు పట్టడం లేదు. ఏదో పిచ్చి వాగుడు... కారంటున్నాడు. మేడంటున్నాడు. ఏదైనా కల్పించుకోబోతే మళ్లీ మాట్లాడకుండా మండి పడుతున్నాడు" అని చెప్పాడు రామచంద్రరావు, తన వంతు వచ్చిం దన్నట్టు.

రాధకు కన్నీళ్ల పర్యంతమయింది. గిరు క్కున తిరిగి వెళ్లి గోపాలాన్ని చూసింది. ఏదో చాలా సీరియస్‌గా వ్రాస్తున్నాడు. రాధకు తెలుసు ఆ వ్రాసేది ఏ భాషా కాదని. అయినా కూడా వాళ్లు చెప్పింది అబద్ధమనిపిస్తూంది.

"ఏం, అలా చేస్తున్నా రెందుకండీ?"

కన్నీళ్లు నింపుకుని తన కేమో అయిందని గాద్గదికంగా అడుగుతున్న భార్య మొహం చూసేసరికి నిజంగా బాధేసింది. "అంతా ఉట్టిదే, రాధీ" అందా మనుకున్న వాడల్లా పరిస్థితులు జ్ఞాపకం వచ్చి,

"ఓహో ... రోజీ! వెళ్లి రమ్మ న్నాను కదూ? ఇంకా ఎందుకున్నావు? చీకటి పడుతోంది. మీ అమ్మగారు గాభరా పడగలరు. ఇప్పుడు వ్రాసే రిపోర్టు విషయాలు రేపు చెపుతాలే" అన్నాడు గోపాలం.

బయట డ్రాయింగు రూమ్‌లోకి విశ్వామిత్రుడి కోపంతో వచ్చిన ఇంటత నికి విషయమంతా చెప్పి, కిరాయి అడగ డానికి ఇది సమయం కాదని నచ్చచెప్పి, అడిగితే ఎగబడతాడని భయం పెట్టి, నిష్కృడిగా సౌమ్యంగా తయారు చేశాడు సంపంగి. భూతద్దాల్లోంచి బెరుకుగా చూస్తూండిపోయాడు అతను.

అప్పుడప్పుడు తలుపుకి కట్టిన కర్టెన్ గాలికి పైకి లేచి, ఇంటతని, రామచంద్ర రావు ముఖాలను స్పృశించి, లోన ఉన్న గోపాలాన్ని, రాధను చూయించి మళ్లీ పడిపోతూంది.

"నే నెటు వెళతానండీ. మీ దాన్ని నేను. మీతోనే ఉంటాను. సుస్తీగా ఉందా?" అని ఏడుస్తూ గోపాలం నొసలు తాకింది రాధ.

"వాట్ !!!" విసురుగా లేచాడు గోపాలం. "మిస్ మాలా, అనవసరంగా చనువు తీసుకోకు. నా దానివి కావాలనీ యత్నించకు. భార్యా పిల్లలతో ఉన్నవాణ్ణి. నువ్వు కేవలం పెర్సనల్ సెక్రటరీవి. అంతే, అలాగే ఉండు. నే నెన్నోసార్లు చెప్పా నీ విషయం. ఇలాగే ప్రవర్తిస్తే, నిన్ను తీసెయ్యా ల్సొస్తుంది."

బయట సంపంగి మహా సంబరపడి పోతున్నాడు. ఇంటతని, రామచంద్ర రావుల వెర్రి చూపులకు నవ్వొస్తూంది. పోగా లోన గోపాలం మాటలకు విస్మయు డవుతున్నాడు. 'ఓరి భడవా! ఎంతెంత మాట్లాడేస్తున్నావురా! వంటాడిలా ఏమీ తెలియనట్టుండే నువ్వేనా! ఆఁ ... భార్యను పెర్సనల్ సెక్రటరీ అంటు న్నాడు. పేర్లు మార్చి మార్చి పిలు స్తున్నాడు. గోపాలం గాడిలో ఓ నటుడూ ఉన్నాడన్న మాట!' అని అనుకున్నాడేగాని,

గోపాలాన్ని సమర్థిస్తూ తనూ నటిస్తున్నాడని సంపంగి అనుకోవడం లేదు. హృదయంలో నవ్వుకుంటూ బయటికి విషాదం వెళ్ళగక్కుతున్నాడు.

సంపంగి ఎంత సంతోషపడుతున్నాడో అంత విచారమూ పడుతున్నాడు — వచ్చిన వాళ్ళందరూ గోపాలం విషయం తెలుసుకుని వెంటనే ఈ పూటకు అదృశ్యమవుతారు, ఆ తరవాత మళ్ళీ ఎప్పటిలా మసలుకోవచ్చు అని. కాని, వచ్చిన వాడు వచ్చినట్టు ఇక్కడే తిష్ఠ వేస్తున్నాడు. వెళ్ళమని ఎలా చెప్పడం? మరి పిల్లలా కూర్చుని చేస్తున్న దేమిటి? నా తల కాయ!! తీవ్రంగా ఆలోచిస్తున్న ఆలోచన లాగిపోయేట్లు, లోప గదిలో నుండి గడియారం అలారం వినిపించింది.

టేబుల్ గడియారానికి అలారం ఎవరు తిప్పి పెట్టారో ఎవరికీ తెలియదు గోపాలానికి తప్ప! గోపాలానికి జ్ఞాపకమే ఉదయం ఆ పని చేసింది తనేనని. కాని, ఇప్పుడు—"శిలా! ఫోనొచ్చి నట్టుంది. చూడు. ఈవేళకు క్రిస్టోఫర్—నా ఫ్రెండ్ ఫోన్ చేస్తానన్నాడు. నా గురించి అడిగితే నర్ రెస్ట్ తీసుకుంటున్నారని చెప్పు" అన్నాడు.

గుండె నిండా నిండుకున్న భయం లోంచి మాటలు వెతుక్కోవలసివస్తోంది రాధకు. కాని, దొరకడం లేదు. ఆవేశంగా నిలబడింది కన్నీళ్ళతో.

తన మాటలు పూర్తి చేయకముందే బయట డేవిడ్, ఈశ్వర్‌లు వచ్చి సంపంగిని విష్ చేస్తున్నట్లు మాటలు వినిపించాయి గోపాలానికి. డేవిడ్ వచ్చాడంటే డబ్బడగడానికి వచ్చాడు. కాని, ఈశ్వర్ ఎందు కొచ్చినట్లు? రాస్కెల్. మూర్ఖుల్లయింది రెండొందలు అప్పుడుక్కెళ్ళి. మళ్ళీ కనిపించలేదు. మరిప్పుడు వచ్చింది ఆ డబ్బు ఇచ్చేయడానికో, మరిన్ని రూపాయలు అప్పడగడానికో? సందిగ్ధావస్థలో, ఆలోచనా పరంపరలో కొట్టుమిట్టాడుతున్న ఎంత పరిస్థితిలో ఈశ్వర్ పిలుపు వినవచ్చింది గోపాలానికి.

బయటి గదిలోకి వెళ్ళాలి అని అనుకోలేదు గోపాలం నిజానికి. కాని, వెళ్ళాడు, డబ్బు తిర్చి పోవడానికే వచ్చాడేమో అనుకుంటూ. ఆ సంతోషంలో అతన్ని విష్ చేయడానికి ఎత్తిన చేయి, అప్పటి నుండి కష్టపడి కల్పించిన పరిస్థితులను సడలించేదిగా అయినట్లు తోచింది. ఆ క్షణమే అదే చేతిని 'ఎవరు కావాలన్నట్లు' ఊపి సీరియస్ మొహం పెట్టాడు.

"నమస్కారమండీ!" వినయంగానే అన్నాడు ఈశ్వర్.

"నమస్కారం!" అని గోపాలం అనలేదు. చిన్నగా తల ఊపి ఏమిటన్నట్లు కనుబొమ్మ లెగరేశాడు.

"చెప్పిన పని చేయడం చేతకాదు కానీ, క్షమాపణ చెప్పుకోవడాని కొచ్చావ్ సిగ్గులేదూ?"

గోపాలం ప్రవర్తన ఈశ్వర్‌కు కొత్తగా అనిపిస్తోంది. పక్కనే గోపాలానికి మతి చలించిందన్న కబురు సంపంగి అన్ని రకాల ఏడుపుల్ని మిళాయించి, డేవిడ్ నమ్మేట్లు చెప్పడం మొదలెట్టా డప్పుడే. డేవిడ్ చిన్నగా తల ఊపుతూ ఆశ్చర్యంగా గోపాలాన్ని చూస్తున్నాడు.

"గోపాలంగా రిప్పు డెవర్నీ గుర్తు పట్టే స్థితిలో లేరు. కొన్ని రోజుల తరవాత వచ్చి కలుసుకోవడం మంచిది." సంపంగిలోని విషాదం పలికింది. ఈ విషయం ఈశ్వర్ మననమూ పడుతూంది.

టూత్ బ్రష్ మీసాలు, కళ్ళద్దాలు, హ్యాట్‌తో ఉన్న ఇంటతని మీద బాగా కోప మొచ్చింది గోపాలానికి. అతని మొహం చూస్తూ—"బ్లడీ రోగ్స్" అన్నాడు. "వెంకన్నా! గూర్ఖా నిటు పిలువ్. ఈ మొండిఘటాల్ని గెంటించు. ఊరికే డిస్టర్బ్ చేస్తున్నారు. రికమండేషన్నా! రికమండేషన్నా!! ఎవరికని? ఎంతకని చెయ్యను? అరె—మనిషి పరిస్థితి అర్థం చేసుకోవాలండీ!" చాలా పెద్ద మనిషి తరహాగా మాట్లాడుతున్నాడు గోపాలం.

మొహం చూస్తూ ఎంతలేసి మాటలు తిడుతున్నా డీయన! పళ్ళు కొరుకుతూ ఉడుక్కున్నాడు ఇంటతను. కాని, ఏమీ అనేట్లు లేదు. 'బల్లి గుడ్లు పెట్టాడు. పాపం' అనుకున్నాడు గోపాలం.

అది పట్టించుకోకుండా- "మా మదర్ ఆరోగ్యం బాగుండలేదు,వెళ్ళాలి" అంటూ సంపంగికి చెప్పి డేవిడ్ లేచాడు. ఆ తరవాత ఈశ్వర్ లేచాడు. కొన్ని సానుభూతి మాటలు చెప్పాక, ఇప్పుడే ఉడాయిస్తే సరి. ఆరు నెలల వరకూ లోకాలేదనుకుని, "ఓ రెండొందలు గోపాలంగారి కివ్వాల్సెను. ఇచ్చి వెళదామ నొచ్చాను. ఈ స్థితిలో ఇస్తే అతనికి గుర్తుండదు. బాగవగానే వచ్చి వెళ్ళినట్టు చెప్పండి" అన్నాడు ఈశ్వర్, గోపాలా న్నదోలా చూస్తూ.

అంతా నిమిషాల మీద అయిపోతుం దేమిటి? గోపాలాని కేదో చేతికందీ, అందకుండా పోతున్నట్లనిపిస్తోంది. ఈశ్వర్! నిజంగా భగవంతుడిలా అవసరానికి తీసుకొచ్చాడు డబ్బు. "ఒరే, ఈశ్వర్! డబ్బివ్వరా" అంటే, బాగానే ఉన్నానని వీళ్ళంతా మీద ఎగబడతారు, వాళ్ళ డబ్బుల కోసం ... కాని, ఎలా?' డేవిడ్, ఈశ్వర్లు మెట్లు దిగుతున్నారు. గోపాలం గుండె వేగం ఎక్కువైంది. ఒక రకపు వేడి గుండెలో! ఎలా, ఎలా? ఆ రెండు వందలైనా ఎన్నో అవసరాలకు వస్తాయి.

ఎంతకని ఇలా నటించాలరు? ఎప్పుడో అప్పుడు ఎవరిని వారి కిష్టమైనదే. మొహం చెమటమయ మయింది.



కుటుంబం

ఫొటో—ఎమ్. వెంకటరమణి (మద్రాసు)

ఇంక పిచ్చిగా మాట్లాడడానికైనా మాటలు రావడం లేదు.

'పోతే పోనీలే — ఇంత స్ట్రైట్‌గా ఉన్న సిచుయేషన్ చెడగొట్టడ మెందుకూ? కొంచెం చూసి, రాత్రయిందని వీళ్ళిళ్లి పోతారు. రేపొద్దున్న ఈశ్వర్ ఇంటికి వెళ్ళి అడిగి తెచ్చుకో వచ్చు. మరో ఆలోచన గోపాలం మెదడులో. అబ్బే, వీడా! దొరకడు. మరి మూడు నాలుగు నెలల వరకు ఎక్కడా కనిపించడు. వాడి సంగతంతే. ఎంత మంచి ఘడియ ఉందో ఈవేళ! వాని అంతట వాడే డబ్బు తీసుకొచ్చాడు. ఇప్పుడే లాగేసుకోవడం మంచిది.'

సంపంగి ఏదో చెబుదా మన్నట్లున్నాడు. గట్టిగా ఏడవడానికి కూడా వీల్లేక కర్టెన్ చాటుకు నిలబడింది రాధ. కళ్ళు వెళ్ళబట్టి చూస్తూ ఇంటతను, రామచంద్రరావూ ...

గోపాలం ఎవర్నీ పట్టించుకునేట్లు లేడు. ఈశ్వర్ రోడ్డు పైన పడుతున్నాడు. దూరమవుతున్నాడు. రూపాయలు దూర మవుతున్నాయి.

'డేవిడ్ డబ్బు అవసరంలో ఉన్నాడు. ఈశ్వర్ దగ్గర డబ్బుందని తెలిసింది. అందుకే మెల్లగా బుజ్జగించి లాగేసుకో వచ్చు. ఇక తనకు చేరడం ఎప్పుడు? ఎలాగ? ఏం చెయ్యాలి?' అన్న ఆలోచనలు గోపాలం మనసులో తిరుగుతూనే ఉన్నాయి. గోపాలం ఉదయం తిన్నదే తిండి. మళ్ళీ ఏమీ తినలేదు. నీరసంగా ఎలాగో ఉంది తేలిపోతున్నట్లు — 'ఈశ్వర్ దగ్గర రెండొందలు తీసుకుని, ఇవ్వవలసిన ఏభై డేవిడ్ కిస్తే— మాట ఏభై అయినా చేతి కొస్తాయి. ఏదో ఓ వంక పెట్టుకుని, రోడ్డుమీద పడి మలుపు తిరిగాక, ఈశ్వర్, డేవిడ్‌లకు అసలు విషయం చెప్పి, తరవాత భయపడద్దు అని రాధకు చెప్పి పంపితే సరిపోతుంది. ఇంటతన్ని, బాబాయ్‌ని వదిలించుకో వచ్చు' అనుకున్న గోపాలం పిచ్చివాడిలా కేకేసి, "అరేయ్, దొంగా, ఠాం... ఆగరా బడాచోర్ ..." అని బిగ్గరగా కేకలేస్తూ రోడ్డు మీదికి ఉరికాడు.

'వీడికి నిజంగా మతి చలించిందా ఏమిటి?' అనుకుంటూ సంపంగి అతన్ని అనుసరించాడు.

వణుకుతున్న గుండెలో, ఆందోళనతో ఏం చేయాలో తెలియని స్థితిలో ఉంది రాధ.

ఆకస్మిక సంఘటనకు, నిలువుగుడ్లేసి, పీచు పీచుమంటున్న మనసులతో ఒకరి ముఖం ఒకరు చూసుకుని, పోవడానికి లేచి నిలబడ్డారు గోపాలం బాబాయి, ఇంటతను. ★